99

ధారావాహిక



# జాయ సేనాపతి

## చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** ఒకనాడు ఉదయాన్నే.. ఓ గాత్రం.. తంబుర నాదంతో మేళవించి ప్రతిధ్వనిస్తూ జాయపుని చెవిన పడ్డది. ఆ పాడుకుంటూ పోతున్నది ఓ భిక్షుక గాయకుడు.. మాల దాసరి. కాస్త పులకింత కలిగింది జాయపునికి. పొద్దుగుంకే వేళకు దాసరివాళ్లుండే గుడిసెల దగ్గరికి వెళ్లాడు. అక్కడి రావిచెట్టు మొదట్లో ఉన్న దిమ్మెపై కూర్చున్నాడు. కాస్త అవతలగా మరో రావిచెట్టు. దాని మొదట్లో ఓ చిన్నగుడి. రానురానూ చీకటి ముసురుకుంటుండగా.. ఎవరో మహిళ దైవప్రార్థన చేయడం వినిపించింది. ఆశ్చర్యంగా అటు చూస్తే.. ఆ గ్రామదేవత ఎదుట ఓ వృద్ధ మహిళ పాడుతున్నది. పాడుతూనే చీరె కొంగు నడుంవద్ద దోపి నాట్యానికి సిద్ధమై భంగిమ తీసుకుంది.

"ఓం నమశ్శివాయ.."

ఆమె ఆ గ్రామదేవతను శివునిగా గుర్తిస్తూ పాడుతున్నది. విగ్రహం ఏ దేవుడో కానీ.. శివునిగా స్పందన కనబరుస్తున్నది.

విస్మయంతో దగ్గరగా వెళ్లిన జాయపుడు.. తనకు తెలియకుండానే లీలగా కదులుతున్నాడు. గ్రీవ (మెడ), కటి (నడుం), త్రిభంగ కదలికలు.. ఆమె జాయపుణ్ని చూసి.. మళ్లీ చూసి.. కళ్లు కదిపి ఆహ్వానించింది. నాట్యమాడమన్నట్లు! అతని శరీరం జలదరించింది. పైనున్న ఉత్తరీయం నడుముకు బిగించి.. స్థానకం తీసుకుని ఆమెతో కాలు కలిపాడు. ఆమెతో గొంతు కలిపాడు. ఇద్దరూ స్వామికి రంగభోగ నివేదన సమర్పిస్తున్నారు.

ఆ దేవదేవుడు ఇంతింత కళ్లు చేసుకుని ముగ్ధుడై చూస్తున్నాడు. మహానాట్యకారుడు జాయపుడు ఓ అపరిచిత వృద్ధ గుడిసానితో పాదం కలిపి ఆ మహాశివునికి సంధ్యభోగం నిర్వహించడం.. అతనికే సంబరంగా, అబ్బురంగా ఉంది. అప్పుడే.. ఏదో తప్పు జరిగినట్లు.. ఆయన గుర్తించిన లిప్తకాలంలోనే, ఆమె చెయ్యి జాయపుని చెంపను బలంగా తాకింది.

"మహారుద్రునికి భోగం అనుకున్నావా!? లంజతో చుళిక అనుకున్నావా!?".

క్రోధంతో ఆమె గొంతు నిప్పులు కక్కింది. రెండు చెంపలూ మళ్లీ మళ్లీ వాయించింది. అన్నీ భరించి చేతులు జోడించి తప్పును క్షమించమన్నట్లు తలవంచాడు.. జీవితంలో తొలిసారి. మరుక్షణం ఆమె జాయపుణ్ని పట్టుకుని మెల్లగా జారి పడిపోయింది. స్పృహ తప్పింది.

"అయ్యో అయ్యో.." అంటూ, చుట్టూ ఉన్న స్త్రీలు దగ్గరికొచ్చారు.

"అన్నం తిని ఎన్ని రోజులయ్యిందో.." ఒకామె అన్నది.

* * *

దాదాపు మూడు మాసాల అనంతరం.

ఆమె.. సొక్కమాంబ నట్టువాంగం వాయిస్తున్నది. ముందున్న పిల్లలు ముద్రలు (చేతులతో చేసేవి) పడుతున్నారు.. నాట్యాభ్యాసంలో భాగంగా.

అక్కడే.. ఆ చిన్నగుడి ఇప్పుడు ఓ చక్కని రుద్రాలయం కాగా, దానిముందు ఓ నాట్యగురుకులం నిర్మించి ఉంది. జాయపుడు కూడా పిల్లలకు పాఠం చెప్పి బయటికి వచ్చి.. ఆ రావిచెట్టు దిమ్మెవద్ద కూర్చున్నాడు.